పనిచేయని నిఘా నేత్రాలు

- ఇరువై నెలలుగా పట్టించుకోని అధికారులు
- ఇటీవల రెండు దొంగతనాలు

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామంలో విరాళాలు, జీపీ నిధులతో రెండు పర్యాయాలు దాదాపు రూ.ఐదున్నర లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఇరువై నెలలుగా పనిచేయడంలేదు. గ్రామంలో గడిచిన రెండు నెలల వ్యవధిలో రెండు చోరీలు జరిగాయి. దొంగలను పట్టుకోవడానికి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మరిన్ని దొంగతనాలు జరిగే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2017–18 సంవత్సరంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు అప్పటి ఎస్సై శంకర్‌రావు సూచన మేరకు ప్రజా విరాళాలు ఆటోయూనియన్, ట్రాక్టర్ అసోసియేషన్, కుల సంఘాల నుంచి రూ.3.20 లక్షలు సేకరించారు. 26 కెమెరాలను గ్రామంలో ఏర్పాటు చేశారు. మూడేళ్లు పనిచేసినా పట్టించుకునేవారు లేకపోవడంతో మూలనపడ్డాయి. మళ్లీ 2021–22వ సంవత్సరంలో జీపీ నిధులు రూ. 2.80 లక్షలతో 22 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సీసీ కెమెరాల ఆపరేటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. ఇరవై నెలలుగా నిఘా నేత్రాలు పనిచేయడంలేదు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమకుంటే సాంకేతిక లోపంతో పనిచేయకపోవడం వల్ల గ్రామంలో చోరీలు జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీలోని ఓ ఇంట్లో నగదు, బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఊరి చివరన ఉన్న శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి ఆలయం హుండీలోని నగదు, అమ్మవారి ముక్కుపుడక, ఇతర వస్తువులు తస్కరించారు. దొంగలను పోలీసులు ఇప్పటి వరకు పట్టుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి సీసీ కెమెరాలకు మరమ్మతు చేయించాలని మాజీ ఉపసర్పంచ్ మోర ప్రవీణ్‌కుమార్ కోరుతున్నారు.


నేలచూపు చూస్తున్న సీసీ కెమెరా

క్లుప్తంగా

జూలై 1న విశ్వకర్మ అభినందన సభ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

చిగురుమామిడి: వరంగల్‌లో జూలై 1న నిర్వహించే విశ్వకర్మ అభినందన సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి విశ్వకర్మలు అధిక సంఖ్యలో తరలిరావాలని సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ కోరారు. బుధవారం చిగురుమామిడిలో సభ పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు రామోజు రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు నాయకులు అనువోజు బాలకృష్ణచారి, పోలోజు సదాచారి, జనార్ధనాచారి, సుధాకర్, సదాచారి, వెంకటరమణాచారి, కుమారస్వామి, చిరంజీవి, రాజయ్య, రమేశ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలి


మాట్లాడుతున్న కొప్పుల శంకర్, తదితరులు

ఇల్లందకుంట: పంచాయతీ కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శ్రీరాములపల్లి గ్రామ పంచాయతీలో పదిహేనేళ్లుగా పనిచేస్తున్న జీపీ కార్మికుడి పేరును కార్యదర్శి ఆన్‌లైన్‌లో నమోదుచేయకుండా, తాత్కాలికంగా రోజువారి పనిలోకి తీసుకున్న కార్మికుడి పేరు ను ఆన్‌లైన్‌లో నమోదుచేయడం అన్యాయమన్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సీనియార్టీ ప్రకారం పర్లపల్లి మల్లేష్ పేరును ఆన్‌లైన్‌లోనమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొత్తూరి మల్లయ్య, రావుల ఎల్లయ్య, రేణిగుంట్ల సారయ్య, గంధసిరి సంపత్, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


జడ్జిని సన్మానిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణానికి చెందిన బత్తుల మానస జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది. ఈసందర్భంగా ప్రజాసంఘాల నాయకులు బుధవారం ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పాక సతీష్, బండ శ్రీనివాస్, పలకల ఈశ్వర్‌రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్, రుద్రారపు కుమార్,పసుల స్వామి, తూమువెంకట రెడ్డి, టి.మాధవరావు, సందెల వెంకన్న, తాళ్లపల్లి అమరేందర్, అంబాల రవీందర్ చందర్, సత్యరాజ్ తదితరులున్నారు.

ఎంఈవోకు వినతి


ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హుజూరాబాద్: బీసీ ఆజాదీ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు బుధవారం ఎంఈవో భూపతి శ్రీనివాస్‌కు వినతి పత్రం సమర్పించారు. ప్రైవేట్ కళాశాలల్లో విజిలెన్స్ కమిటీలు, ఫీజు రెగ్యులేటరి కమిటీలను ఏర్పాటు చేయాలని, అన్ని మండలాలకు ఎంఈవోలను నియమించాలని కోరారు. కార్పొరేట్ సంస్థల్లో పేదలకు ఉచిత విద్య అమలు చేయాలన్నారు.

కలెక్టర్, సీపీలకు ఫిర్యాదు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లికి చెందిన రాచమల్ల నిర్మల, మహేందర్ రామన్నపల్లి గ్రామ పరిధి సర్వే నంబర్ 405/సీలో భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. భూమి పక్కన ఉన్న మరికొంత భూమిని ముగ్గురు వ్యక్తులు కొనుగోలు చేసి తమ భూమిని కబ్జా చేశారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని కలెక్టర్, సీపీకి ఫిర్యాదు చేశారు. ప్రాణభయం ఉందని, న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

లారీల అడ్డగింత

వీణవంక: మండలంలోని హిమ్మత్‌నగర్‌లో ఇసుక లారీలను గ్రామస్తులు అడ్డుకున్నారు. కొండపాక రెవెన్యూ గ్రామ పరిధిలో హిమ్మత్‌నగర్ ఉందని, ఇసుక లారీలు లోడింగ్ తర్వాత తాటిపత్రులు కేవలం కొండపాకవారు కడుతున్నారని, మా గ్రామస్తులకు అవకాశం ఇచ్చి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై తిరుపతి ఆందోళనకారుల వద్దకు వెళ్లి మాట్లాడారు. ఇరుగ్రామాల వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మాట్లాడుతానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

జాతీయ హాకీ జట్టుకు క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన మేఘన, శివసంతోషిణి

హుజూరాబాద్: సబ్ జూనియర్ జాతీయ హాకీ జట్టుకు పట్టణానికి చెందిన క్రీడాకారులు తాళ్లపల్లి మేఘన, జంపాల శివ సంతోషినిలు ఎంపికయ్యారని హుజూరాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్,సెక్రెటరీ బొడిగె తిరుపతి, జిల్లా ఇంచార్జ్ సెక్రెటరీ తారిక్ హైమద్ బుధవారం తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లోని రైల్వే స్టేడియంలో నిర్వహించిన సబ్ జూనియర్ ఉమెన్ జాతీయస్థాయి ఎంపిక పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచారని, ఎంపిక పట్ల జిల్లా హాకీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, హుజూరాబాద్ హాకీ క్లబ్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, సమ్మయ్య, హాకీ క్లబ్ ఉపాధ్యక్షుడు యూసుఫ్, వేముల రవికుమార్, సాదుల శ్యాంసుందర్, రాజేశ్, సాయికృష్ణ, ప్రదీప్, కే రాజేష్, విక్రం కోచ్ విక్రమ్, వినయ్ సీనియర్ క్రీడాకారులు వర్షం వ్యక్తం చేశారు.

స్వచ్ఛ హుజూరాబాద్‌లో భాగస్వాములవ్వాలి


ప్రశంసాపత్రాలు అందిస్తున్న కమిషనర్ సమ్మయ్య

హుజూరాబాద్: స్వచ్ఛ హుజూరాబాద్‌లో ప్రతి విద్యార్థి భాగస్వాములవ్వాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అన్నారు. బుధవారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పట్టణ అభివృద్ధి వందరోజుల ప్రణాళికలో భాగంగా కేరళ ఇంగ్లిష్ మీడియం, సహస్ర పాఠశాలల్లో పరిసరాల శుభ్రత, తడి,పొడి చెత్త వేరు చేసే విధానం పై అవగాహన కల్పించారు. చెత్త ఆరుబయట వేయటం ద్వారా కలిగే అనర్థాలు, స్వచ్ఛత పాటించడం ద్వారా కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం 28వ వార్డులో ప్రత్యేక పారిశుధ్య పనులు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో భూపతి శ్రీనివాస్, హెచ్ఎం విన్సెంట్, నేరెళ్ల వేణుమాధవ్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న టీచర్లు, నాయకులు

జమ్మికుంటరూరల్: విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో 27న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నా కరపత్రాన్ని బుధవారం మండలంలోని కోరపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ధర్నాను విజయవంత చేయాలి పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సర్దుబాటు విషయంలో తెచ్చిన జీవోను రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, విద్యను అభివృద్ధి పరచాలని, విద్యారంగానికి 20 శాతం బడ్జెట్ కేటాయించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ మండల అధ్యక్షుడు వేణుమాధవ్, హెచ్ఎం సమ్మయ్య, ఉపాధ్యాయులు రాజయ్య, రాజు, కుమారస్వామి, రవికాంత్‌రాజు, పద్మ, విజేందర్‌రెడిడ, సంపత్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా..


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

గంగాధర: మండలంలోని ఉప్పరమల్యాల గ్రామంలో బుధవారం ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాట్లాడుతూ.. జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ మొదలు పెట్టిన ఉద్యమం అణగారిన కులాల్లో సామాజిక చైతన్యం రగిలించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, నగేష్, కర్ర బాపురెడ్డి, సముద్రాల అంజయ్య, దోమకొండ శ్రీనివాస్,శవ రామకృష్ణ, నరేష్, గోపి, రాజేందర్, అంజయ్య, సుధాకర్, మొండయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

ఇల్లందకుంట: తాటిచెట్టు పైనుంచి పడటంతో గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... ఇల్లందకుంటకు చెందిన రావులరవీందర్ వృత్తిలో భాగంగా బుధవారం ఉదయం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా మోకుజారడంతో కిందపడిపోయాడు. తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం జమ్మికుంటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం వరంగల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

పాఠశాలల్లోని సమస్యలపై పట్టింపు కరువు


సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ఇల్లందకుంట: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్వీనాయకుడు జవ్వాజి అనిల్ ఆరోపించారు. బుధవారం మండలంలోని చిన్న కోమటిపల్లి గ్రామంలోని పాఠశాలలో సమస్యలను ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆదేశాలతో పాఠశాలను సందర్శించామన్నారు. ఇప్పటి వరకు విద్యాశాఖమంత్రిని నియమించకపోవడమేంటని ప్రశ్నించారు. పాఠశాల ప్రారంభమై 14రోజులు గడుస్తున్నా విద్యార్థులకు అల్పాహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గత ప్రభుత్వం కల్పించిన వసతులు ఉన్నాయని, సమస్యలను పరిష్కరించకుంటే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిరసన, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కౌశిక్,మహంకాళి రాజు, రంజిత్, శేషు, ప్రశాంత్, నాగరాజు, సుమన్ పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల అందజేత

రామడుగు: మండలంలోని రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు సీఆర్‌పీఎఫ్ రిటైర్డ్ ఎస్సై మల్యాల లింగయ్య బుధవారం స్కూల్ బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రంగనాథ శర్మ, టీచర్లు నాగేందర్, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, ఆరిఫ్‌హుస్సేన్, రవీందర్, సరోజనీ, పద్మజారాణి, కరుణాకర్‌రావు, సునీత, రమేశ్‌కుమార్, కవిత, శంకరయ్య పలువురు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి, హన్మాజిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం సేవ ఫౌండేషన్ సభ్యులు ఉచితంగా బ్యాగులు, బుక్కులు, పెన్నులు అందజేశారు. పేద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది రాకూడదని దాతల సహాయంతో కార్యక్రమం చేపట్టామన్నారు. ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొబైల్స్ అప్పగింత


బాధితులకు ఫోన్లు అందజేస్తున్న సీఐ రామకృష్ణ

జమ్మికుంట: పోగొట్టుకున్న మొబైల్స్‌ను జమ్మికుంట టౌన్‌సీఐ ఎస్ రామకృష్ణ బుధవారం బాధితులకు అప్పగించారు. పట్టణం, మండలంలోని నాగంపేట గ్రామానికి చెందిన వ్యక్తులు ఇటీవల ఫోన్లు పోగొట్టుకున్నారు. పోలీసులను సంప్రదించగా సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్లు స్వాధీనం చేసుకొని అందజేశారు.

అంబేద్కర్ యువజన సంఘంలో చేరిక


సంఘంలో చేరుతున్న దేవునూరి కిష్టయ్య

శంకరపట్నం: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన దేవునూరి కిష్టయ్య బుధవారం తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘంలో చేరారు. కేశవపట్నంలో జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్ సమక్షంలో బుధవారం జరిగిన సమావేశంలో చేరినట్టు మండల అధ్యక్షుడు అంతడ్పుల సతీశ్ తెలిపారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘంలో పనిచేసిన కిష్టయ్య తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘంలో చేరారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ రవి, నియోజకవర్గ అధ్యక్షుడు మేరుగు శ్రీనివాస్, ఓదెలు, భాస్కర్, కళ్యాణ్, అశోక్, లింగస్వామి, తిరుపతి, రాజు, సురేశ్, సారయ్య పాల్గొన్నారు.

29న జూనియర్స్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు



కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా బాస్కెట్ బాల్ సంఘం ఆధ్వర్యంలో 29న కరీంనగర్‌లోని విద్యుత్‌శాఖ బాస్కెట్ బాల్ కోర్టులో జూనియర్స్ బాలబాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు సంఘం కార్యదర్శి బి అనంతరెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో రాణించిన క్రీడాకారులను గద్వాల జిల్లా ఉత్తనూరులో జరిగే జూనియర్స్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక చేయనున్నామని, ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2007 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 7 గంటలకు హాజరుకావాలన్నారు.

కర్ణన్‌కు శుభాకాంక్షలు

జమ్మికుంట: ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఆర్‌వీ కర్ణన్ బాధ్యతలు తీసుకున్న సందర్భంగా పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త సిలువేరు శ్రీకాంత్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి

గన్నేరువరం: జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని సర్వాయి పాపన్న మోపు దెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి జాగిరి శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వ కోరారు. గునుకులకొండాపూర్‌లో బుధవారం మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లు కేటాయించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల నుంచే ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఓపెన్ జిమ్‌లు ప్రారంభం



సైదాపూర్: మండలంలోని అన్ని గ్రామాలకు ఓపెన్ జిమ్‌లు మంజూరయ్యాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంత సుధాకర్ తెలిపారు. బుధవారం సోమారం గ్రామంతో పాటు అన్ని గ్రామాల్లో ఓపెన్ జిమ్‌ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. నాయకులు గుండారపు శ్రీనివాస్, మునిగంటి సంతోష్, పంతంగి రవీందర్, మీస బీరయ్య, తాళ్లపల్లి తిరుపతి, గడ్డం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీల్లో పోలీసుల తనిఖీ


వివరాలు తెలుసుకుంటున్న ఏఎస్పీ

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్, ఒద్యారం, గర్శకుర్తి, చిన్నాచంపల్లి గ్రామాల్లోని గ్రానైట్ క్వారీలను బుధవారం ఏఎస్పీ శుభం ప్రకాశ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్వారీలలో ఉపయోగించే పేలుడు పదార్థాలు, ఎక్స్‌పైరీ తేదీ, నిల్వ, సరఫరా, లైసెన్స్ వంటి అనుమతులకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. గ్రానైట్‌ను పగలగొట్టడానికి అవలంబించే విధానాలను ఏఎస్పీ అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్, గంగాధర ఎస్సై వంశీకృష్ణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

బీరన్న పట్నాలు, పెద్దమ్మ బోనాలు


పెద్దమ్మతల్లి బోనాలతో వెళ్తున్న మహిళలు


పట్నాలు వేసి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

శంకరపట్నం: మండలంలోని అంబాల్‌పూర్ గ్రామంలో కురుమ కులస్తులు బీరన్న జాతర సందర్భంగా పట్నాలు వేశారు. బోనాలు సమర్పించారు. ఆలయంలో ఒగ్గు పూజారులు పెద్దపట్నాలు వేశారు. కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు బస్వయ్య, తిరుపతి, ఎల్లయ్యలు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని శ్రీరాములపల్లిలో ముదిరాజ్‌లు బుధవారం పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వనభోజనాలకు వెళ్లారు. పెద్దమ్మతల్లి దయవల్ల వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు నిండి మత్స్య సంపద పెరగాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిప్పరబోయిన మొగిలి, రామస్వామి ,సమ్మయ్య, స్వామి, వీరస్వామి, సారయ్య తదితరులుపాల్గొన్నారు.

‘జ్యోతిష్మతి’లో సర్క్యూట్ క్లాష్–2025


పోటీలు ప్రారంభిస్తున్న హెచ్‌వోడీలు

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఈసీఈ విభాగం, ఈసీఈ – ఐసీఐ స్టూడెంట్ చాప్టర్ సహకారంతో ‘సర్క్యూట్ క్లాష్–2025’ ఇంట్రా కాలేజీయట్ రోబోటిక్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులలో పోటీతత్వం, సహకారం, క్రమశిక్షణ, సహనం, నాయకత్వ లక్షణాలను పోటీలు పెంపొందిస్తాయని, విద్యార్థులు విద్యా విషయాలతోపాటు సమాజం విసిరే సవాళ్లను మేధస్సు, ఉపయోగకరమైన ప్రయోగాల ద్వారా ఎదుర్కోవాలని సూచించారు. టెక్నాలజీకి అనుగుణంగా నూతన రంగాలపై దృష్టి సారించాలని, వివిధ టెక్నికల్ బ్రాంచ్‌ల మధ్య సమన్వయంతో కొత్త ఆవిష్కరణలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జువ్వాడి సుమిత్ సాయి మాట్లాడుతూ.. కార్యక్రమం విద్యార్థులను తరగతి గదులకు పరిమితం కాకుండా, వారిలోని సృజనాత్మకతను, ప్రతిభను వెలికితీసేందుకు ఉపకరిస్తుందన్నారు. పోటీలను డీన్ అకాడెమిక్స్ డా. పి.కె. వైశాలి ప్రారంభించగా విజేతలకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ డా. టి.అనిల్ కుమార్, వైశాలి, హెచ్‌వోడీ డా.నాగప్పన్ ఉమాపతి, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ ఎం. రామకృష్ణ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలి


మాట్లాడుతున్న శ్రీశైలం, నాయకులు

గన్నేరువరం: కాంగ్రెస్ ప్రభుత్వం రూ.రెండులక్షల రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలం అన్నారు. బుధవారం మండలంలోని హన్మాజిపల్లెలో మాట్లాడారు. రుణమాఫీకాని రైతులు అయోమయంలో ఉన్నారని, ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ లేదని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రధాన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. అర్హులకు ఇళ్లు, పేదల సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ 30న తహసీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని రైతులు, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సహాయ కార్యదర్శులు కూన మల్లయ్య, పిప్పల కనుకయ్య, నాయకులు మోలుగురి ఆంజనేయులు, గుండ్లపల్లి, గన్నేరువరం గ్రామశాఖ కార్యదర్శులు బోయిని తిరుపతి, బొమ్మకంటి అంజనేయులు, నయూమ్, తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ పాఠశాలలో ఎన్నికల కోలాహలం


ఎన్నికల నిర్వహణ పర్యవేక్షిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో ఎన్నికల కోలాహలం నెలకొంది. పాఠశాలలోని వివిధ విభాగాలకు కెప్టెన్, వైస్ కెప్టెన్ ఎన్నిక కోసం బుధవారం నిర్వహించిన ఎన్నికలను చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఎన్నికల నిర్వహణపై విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ప్రజాస్వామ్య ఎన్నికల తరహాలోనే పాఠశాలలోని విద్యార్థులను వివిధ విభాగాలుగా విభజించి ఎన్నికలు నిర్వహించడంతోపాటు అవగాహన కల్పించామన్నారు. పాఠశాలలోని విద్యార్థులను లక్ష్య, తేజస్, ధృవ, సరస్ విభాగాలుగా చేసి ప్రతీ హౌజ్‌కు బాలురు, బాలికలకు కెప్టెన్, వైస్ కెప్టెన్ ఎన్నికకు వేర్వేరుగా ఎన్నికల నిర్వహణ చేపట్టారు. గెలుపు కోసం కేటాయించిన గుర్తులతో ప్రచారం నిర్వహించగా.. విద్యార్థులు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. వీఎస్ఆర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా కీలకమే కాకుండా ప్రజాసంక్షేమంలో ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బావిలో పడిన ఆవులు



గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామంలో రెండు పాడి ఆవులు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడ్డాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన దొమ్మాటి తిరుపతి చెందినకి ఆవులు బుధవారం నేరెళ్ల నరేష్‌గౌడ్ వ్యవసాయ బావిలో పడిపోయాయి. గ్రామస్తులు, రైతులు ట్రాక్టర్ సహాయంతో బయట తీయగా ప్రాణాపాయం తప్పింది.

బేతిగల్‌లో దొంగల హల్‌చల్

వీణవంక: మండలంలోని బేతిగల్‌లో దొంగలు హల్‌చల్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన మాసాడి చొక్కరావు రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లి బుధవారం ఉదయం ఇంటికి వచ్చారు. ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఏడు గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు 20 తులాల వెండి చోరీకి చేశారని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. గ్రామంలో అనుమానితులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో రాత్రివేళ దొంగలు సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వెన్నంపల్లి వెళ్లే రోడ్డు సమీపంలోని ఇళ్లల్లో మూడు రోజులుగా చోరీకి యత్నించగా గ్రామస్తులు వెంటపడడంతో దొంగలు పరారయ్యారు. దొంగలు సంచరించిన వార్డులో పోలీసులు బుధవారం వివరాలు సేకరించారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి

కరీంనగర్: కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీల ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సంఘ కార్యాలయంలో పలువురు విద్యార్థి నాయకులు పీడీఎస్‌యూలో చేరిన సందర్భంగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను ఉచితంగా అందించే బాధ్యత నుంచి తప్పుకొని వ్యాపార సరుకుగా మార్చాయని మండిపడ్డారు. యూనివర్సిటీల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.